క్లుప్తంగా

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న గెల్లి రవి

హుజూర్‌నగర్ : పట్టణంలోని 21 వార్డులో రూ.3 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, కోఆపరేటివ్ బ్యాంకు దగ్గర రూ.1.50 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులకు సోమవారం బీఆర్‌ఎస్ నాయకుడు గెల్లి రవి, కౌన్సిలర్ గాయత్రి భాస్కర్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నారాయణ, మల్లేష్, సీతా రాములు, వెంకన్న, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూపట్టాలు ఇవ్వాలని వినతి



ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న కాపుగల్లు గ్రామస్తులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లులో అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం కాపుగల్లు గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐకి వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 101, 133, 292 , 332, 420లో గుట్టలు, బీడు భూములను చదును చేసి సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమ భూముల్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటాలనుకునే నిర్ణయాన్ని అధికారులు వెనక్కి తీసుకోవాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోస్‌బాబు, వీరబాబు, శ్రీను, త్రినాథ్, శివ, విజయలక్ష్మి, సత్యవతి, సైదమ్మ, కోటమ్మ తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణాల సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలి

మునగాల : మండలంలో మద్యం దుకాణాల సిండికేట్‌పై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శేఖర్, సహాయ కార్యదర్శి కాసగ రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో మూడు మద్యం దుకాణాలు ఉన్నాయని, వీటిలో రెండు మండల కేంద్రంలో, ఒకటి బరాఖత్‌గూడెంలో నిర్వహిస్తున్నారన్నారు. మండల కేంద్రంలోని రెండు దుకాణాలను సిండికేట్‌గా మార్చి కేవలం ఒక్క దుకాణంతోనే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు దుకాణాలను వేర్వేరుగా నడిపే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని లేనియెడల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

కస్తాల వీరయ్యకు నివాళి

హుజూర్‌నగర్ : పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కస్తాల వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఆయన దశదిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి కౌన్సిలర్ రాజా క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రావణ్‌కుమార్, నాయకులు గల్లా వెంకటేశ్వర్లు, బిదనమ్మ, కె.ముత్యయ్య, తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు ఏర్పాటు



బోడబండతండాలో చేతిపంపు ఏర్పాటు చేయిస్తున్న బాబునాయక్

మఠంపల్లి : మండలంలోని బోడబండతండాలో తాగు నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టినట్లు మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ తెలిపారు. బోడబండతండాలోని ముత్యాలమ్మ దేవాలయం వద్ద నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో సోమవారం చేతి పంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట గ్రామస్తులు తదితరులున్నారు.

నిరుద్యోగ సంఘర్షణ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న నాయకులు

నేరేడుచర్ల : హైదరాబాద్‌లో సోమవారం జరిగిన నిరుద్యోగ సంఘర్షణ సభకు నేరేడుచర్ల పట్టణ కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో నాయకులు నూకల సందీప్‌రెడ్డి, జంగిలి వెంకటేశ్వర్లు, జానయ్య, వెంకన్న, రవి, నాగరాజు, నర్సయ్య తదితరులు ఉన్నారు.

లక్ష్యం.. 1.81లక్షల మొక్కలు

- తొమ్మిదవ విడత హరితహారానికి 15 గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు
- అటవీ, ఔషధ, పండ్లు, పూల మొక్కల పెంపకం
- ఎప్పటికప్పుడు నర్సరీలను పర్యవేక్షిస్తున్న అధికారులు



కాగితరామచంద్రాపురంలోని నర్సరీ

నడిగూడెం : తెలంగాణ రాష్ట్రంలో పచ్చదనాన్ని విస్తరించడంకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా తొమ్మిదవ విడత హరితహారం కార్యక్రమానికి మండలంలో గ్రామాల్లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీలను ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను పెంచుతోంది. వర్షాలు ప్రారంభం కాగానే జూలై, ఆగష్టు నెలలలో పెంచిన మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 1.81 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుని పెంచుతున్నారు. మొక్కలకు నీరు పోయడం, వాటిని సంరక్షించడానికి వన సేవకుడిని నియమించారు. గ్రామాల్లోని నర్సరీలను ఎప్పటికప్పుడు సంబంధిత మండల పరిషత్ అధికారి, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పర్యవేక్షిస్తున్నారు.

15 గ్రామాల్లో నర్సరీలు..

కాగా మండంలో నీరు, విద్యుత్ సౌకర్యం ఉన్న ప్రదేశాలైన మండల కేంద్రంతో పాటు, బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి గ్రామాలలో నర్సరీలను నిర్వహిస్తున్నారు. ఎర్రమట్టి, నల్లమట్టి, పశువుల ఎరువులను ఉపయోగించి మొక్కలను పెంచుతున్నారు.

పెంచుతున్న మొక్కలు ఇవే..

హరితహారం కార్యక్రమంలో భాగంగా రహదారులు, కాల్వ కట్టలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఖాళీ స్థలాలతో పాటు ప్రతి ఇంట్లో నాటేందుకు పండ్ల మొక్కలతో పాటు, అటవీ, పూలు, ఔషధ మొక్కలైన మామిడి, జామ, దానిమ్మ, సీతాఫలం, కర్జూర, రేగు, ఉసిరి, నేరేడు, చింత, బహుమియా, గుల్మహరా, కానుగ, దిర్శెం, శ్రీగంధం, మందార, గులాబీ, అడవి తంగేడు, గన్నేరు, తులసి, కాగితంపూలు, పారిజాతం, రణపాల, తెల్లేరు, రేల, కుంకుడు, మారేడు, వెలక ఇంకా పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. మండల పరిధిలోని 15 గ్రామాలలో పెంచుతున్న నర్సరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిందుకు 15 మంది వనసేవకులకు ఉపాధి కల్పిస్తున్నారు. వన సేవకులకు రోజుకు రెండు వందల రూపాయల వేతనం చెల్లిస్తున్నారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం



తొమ్మిదో విడత హరిత హారం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలో 1.81 లక్షల మొక్కలను పెంచుతున్నాం. ప్రస్తుత వేసవిలో ఉన్నతాధికారులతో పాటు ఉపాధి హామీ పథకం సిబ్బంది నర్సరీలను పర్యవేక్షిస్తున్నాం. వానాకాలంలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నాము.

– నగేష్, ఏపీఓ

న్యాయవాదుల సహకారం చాలా అవసరం

- జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్



మాట్లాడుతున్న నూతన జడ్జి మారుతిప్రసాద్

హుజూర్‌నగర్ : పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి న్యాయవాదుల సహకారం చాలా అవసరమని నూతన జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ అన్నారు. సోమవారం కోర్టు ఆవరణలో స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన జడ్జి మారుతి ప్రసాద్‌కి స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రస్తుతం 8 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఆయా పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి న్యాయవాదులు సహకరించాలని కోరారు. చట్ట పరిధిలోని పరిమితులకు లోబడి న్యాయవాదులకు పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ మాట్లాడుతూ న్యాయ పీఠానికి, న్యాయవాదుల సంఘానికి మధ్య సత్సంబంధాలు ఉన్నప్పుడే న్యాయస్థానంలో కార్యకలాపాలు సక్రమంగా జరుగుతాయని తద్వారా సత్ఫలితాలు వస్తాయన్నారు. తొలుత జూనియర్ సివిల్ జడ్జితో పాటు సీనియర్ సివిల్ జడ్జిలను న్యాయవాదులు శాలువాలు, పూలమాలలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాముల రాంరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాదులు వీజీకే మూర్తి, యాదగిరి, కృష్ణయ్య, సత్యనారాయణ, మాధవరెడ్డి, అంజయ్య, రమణారెడ్డి, నాగార్జున, క్రాంతి, సురేష్, రమాదేవి, ప్రదీప్తి, పి.శ్రీనివాసరావు, పి.చంద్రయ్య, ఎం.వెంకయ్య, సైదా హుస్సేన్, వీరయ్య, నరేష్, నాగేష్, వీరయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సువార్త స్వస్థత పండుగల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : క్రైస్తవుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. షకీనా హైదరాబాద్, పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీస్తు సువార్త స్వస్థత పండుగల సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత, ఉదాత్త, గొప్ప మనసున్న మహాదేవుడు ఏసుక్రీస్తు అని అన్నారు. ఆయన ఉద్బోధించిన బోధనలు మనమందరం ఆచరించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని అన్నారు. అదేవిధంగా సేవాగుణానికి ప్రతీక అయిన మదర్ థెరిస్సా సమాజానికి చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. క్రిస్టియన్ విద్యార్థులకు ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యకు లక్షల రూపాయల సాయం అందిస్తుందని ఆయన తెలిపారు. పవిత్ర జెరూసలెం యాత్రకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. సమాజంలో రుగ్మతలు పోవాలంటే బైబిల్ సూక్తులు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. సువార్త పండుగలు ఏర్పాటు చేసిన షకీనా క్రూసేడర్స్ నాయకులు నోయల్ పర్మనాస్, ఇమ్మానుయేల్ పర్మనాస్, ప్రవీణ్ ఊటుకూరి, వినోద్ దినకర్, ప్రేమ్, ఉదయ్, పెనుయేలు సంస్థ నాయకులు బిషప్ డా.జె.సుదర్శనం, జె.జె.సామ్యూల్‌సన్, ఎం.రాజేష్, జి.ప్రభాకర్, జె.సమానుయేలు, ఇ.ఉదయ్, ఎల్.లాజర్, ఒబద్యా తదితరులు ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేను పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు.

బీఆర్‌ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధి

నడిగూడెం : దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణపురంలో నిర్వహించిన గంగమ్మ జాతరకు ఆయన హాజరై ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణలో దేవాలయాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్లూరి నాగేందర్‌రెడ్డి, నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్, మాజీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగేందర్, నాయకులు వీరబాబు, యాదవుల కులపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మతతత్వ విధానాలు అవలంబిస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్‌రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బూరుగడ్డ, మాచవరం, గోపాపురం గ్రామాలలో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ మతతత్వ విధానాలను అవలంబిస్తుందని, ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, నిత్యవసరాల ధరలు పెంచి పేదప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని, పెద్దనోట్లను రద్దు చేసి ప్రతి ఇంటికి రూ.3 లక్షలు బ్యాంక్‌లో వేస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. జీఎస్టీని తీసుకొచ్చి పేదప్రజలపై భారం మోపారన్నారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్ల హామీ, లక్ష రూపాయల రుణమాఫీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలకూరి బాబు, కొప్పోజు సూర్యనారాయణ, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, మల్లీశ్వరి, ధనుంజయనాయుడు, వెంకటేశ్వర్లు, వీరబాబు, కనకయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సైదులు, వాసుదేవరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పష్టమైన చూపు అందించాలనే 'కంటి వెలుగు'



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

హుజూర్‌నగర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రవి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని 25వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి స్పష్టమైన చూపు అందించాలనే సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు సుష్మ, మల్లిక, శివ, మాధవి, సిబ్బంది రామకృష్ణ, ముత్యాలు, సహీద్, రహీం, జానీపాషా, ఆశా కార్యకర్తలు, ఆర్‌పీలు హేమలత, శారద, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతుల నిలువుదోపిడీ



ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మునగాల : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారని కోదాడ నియోజకవర్గ బీజేపీ నాయకులు కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, వంగవేటి శ్రీనివాసరావు ఆరోపించారు. మండలంలోని తాడువాయి సొసైటీ ఆధ్వర్యంలో విజయవరాఘవపురం వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వారు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ధాన్యాన్ని పరిశీలించి కేంద్రాలలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. దీంతో పలువురు రైతులు పలు విషయాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. రవాణ విషయంలో దిగుమతి ఖర్చులు, లారీ మామూళ్లతో పాటు అదనపు వసూళ్లు, మిల్లర్లు తరుగు కింద క్వింటాల్‌కు 5 కేజీల చొప్పున కటింగ్ చేస్తున్నారని రైతులు తెలిపారు. దీంతో స్పందించిన బీజేపీ నాయకులు సదరు అధికారులను ప్రశ్నించారు. స్పందించిన అధికార యంత్రాంగం భవిష్యత్‌లో ఈ విధంగా జరుగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



సత్యానారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్, నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యంగశ్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి (52) మృతి పార్టీకి తీరని లోటని సర్పంచ్ శాసనాల నాగసైదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని గోపాలపురంలో అనారోగ్యంతో మృతి చెందిన సత్యరానాయణరెడ్డి మృతదేహానికి ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్యగౌడ్‌తో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలిశెట్టి బ్రహ్మం, అంజయ్య, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు అండగా ఉంటా



చెక్కు అందజేస్తున్న కెఎల్‌ఎన్ ప్రసాద్

కోదాడరూరల్ : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల గీత కార్మికులకు అండగా ఉంటానని కౌండిన్య గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది కెఎల్‌ఎన్. ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కాపుగల్లుకు చెందిన గీత కార్మికుడు కాసాని పుల్లయ్య ఇటీవల తాటిచెట్టుపై నుంచి కింద పడటంతో అతనికి కాలు విరిగింది. దీంతో అతనికి ప్రసాద్ గీత కార్పొరేషన్ నుంచి రూ.15 వేల చెక్కును మంజూరు చేయించి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులు లైసెన్స్‌లు కలిగి ఉండాలని, లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు గౌడ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాసాని వీరబాబు, కాసాని ధనమూర్తి, శ్రీనివాసరావు, బాలేబోయిన రాజు, బాబు, సత్యనారాయణ, రాములు తదితరులు ఉన్నారు.

క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



వేపలసింగారంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

హుజూర్‌నగర్‌రూరల్ : క్రీడాకారులు క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని విచారణ గురువులు రెవ ఫాదర్ తుమ్మా ఇన్నారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వేపలసింగారంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 10వ తేదీన కల్వరి కొండ (చర్చి) 20వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయి కబడ్డీ, జూనియర్ షటిల్, స్లో బైక్స్, షార్ట్‌పుట్, టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు పాసర్లు, క్రీడాకారులు ఉన్నారు.

పల్లకీని మోసే బోయిలుగా ఇంకెన్నాళ్లు



దొంగరి శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణమాచారి

అనంతగిరి : బీసీలు ఇంకెన్నాళ్లు పల్లకీని మోసే బోయిలుగా ఉండాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడేపల్లి కృష్ణమాచారి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో 92 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఐక్యతను సాధిస్తే కేవలం 8 శాతం ఉన్న వర్గాలు అధికారానికి దూరం అవుతాయన్నారు. అట్టడుగు వర్గాలు అధికారాన్ని చేజిక్కించుకోవాలని, అంబేడ్కర్ కలలను సాకారం చేసేందుకు పోరాటం చేయాలన్నారు. అనంతరం ఆ సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా దొంగరి శ్రీనివాస్‌కు, యువజన విభాగం అధ్యక్షుడిగా అంకతి రమేష్‌కు నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ ధూళిపాళ ధనుంజయ నాయుడు, కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుగుర్తి వెంకటరమణాచారి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బచ్చు రాజ్యం, మండవ నాగమణి, నిగిడాల వీరయ్య, యరసాని నాగమణి, లక్ష్మి, వెంకన్న, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



సిరిపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

నడిగూడెం : ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని సిరిపురంలో అదే గ్రామానికి చెందిన డాక్టర్ జంపాల శ్రీనివాస్ సహకారంతో గ్రామానికి చెందిన జంపాల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, ఆశ్రయం హ్యాండ్ హోప్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దాదాపు 400 మందికి పైగా కార్పొరేట్ స్థాయిలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఎక్స్‌రే, ఈసీజీ కంటి, దంత, కిడ్నీ, పక్షవాతం, వెన్నుముక, ఊపిరితిత్తులు తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ, తెర సాంస్కృతిక అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ శెట్టి జ్యోతి, మాజీ సర్పంచ్ పసుపులేటి జనార్దన్, నిర్వాహకులు డాక్టర్ జంపాల శ్రీనివాస్, కాసాని వెంకటేశ్వర్లు, వట్టికూటి చలపతి, శెట్టి వెంకటనారాయణ, లక్ష్మయ్య, శ్రీహరి, రమేష్, శౌరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న కామళ్ల నవీన్

గరిడేపల్లి : అమరవీరుల స్ఫూర్తిని పునికిపుచ్చుకొని నూతన ప్రజాస్వామ్య విప్లవం కోసం కార్మికులు, కర్షకులు ముందుండి పనిచేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య అన్నారు. ఆదివారం కోనాయిగూడెం, వెలిదండ గ్రామాల్లో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో వారు పాల్గొని జెండాలు ఎగురవేశారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వెంకటయ్య, భద్రయ్య, రవి, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షం, రాజు, శ్రీను, వెంకన్న, నర్సింహారావు, సైదులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై ప్రయాణించేదెలా..

- అధ్వానంగా బూరుగడ్డ – కరక్కాయలగూడెం రహదారి
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాని ప్రజల వేడుకోలు



గుంతలమయంగా బూరుగడ్డ - కరక్కాయలగూడెం రోడ్డు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురం నుంచి బూరుగడ్డ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడునా మోకాల లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇది బీటీ రోడ్డా.. లేక మట్టి రోడ్డా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఈ రోడ్డు మార్గంలో బూరుగడ్డ, మాచవరం, కరక్కాయలగూడెం, బేతవోలు, కొండాపురం తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా మండల కేంద్రానికి 5 కిలో మీటర్ల దూరంలోనే ఈ రోడ్డు ఉంటుంది. అలాంటి ఈ రోడ్డు అధ్వానంగా, రహదారిని కంపచెట్లు కమ్మేయడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం ప్రమాదాలు..

హుజూర్‌నగర్ మండల కేంద్రానికి వచ్చే రైతులు, వ్యాపారులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే బెంబేలెత్తుతున్నారు. గత 10 సంవత్సరాల క్రితమే ఈ రోడ్డను నిర్మించగా ఒక్కసారి కూడా మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. కరక్కాయలగూడెం నుంచి బూరుగడ్డ, గోపాలపురం వరకు కూడా లోతైన గుంతలు పడ్డాయి. బీటీ పూర్తిగా పోయి రాళ్లు తేలాయి. మరమ్మతులకు నోచుకోక ఈ దారుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల ముళ్లకంప కూడా దట్టంగా పెరిగింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ దారులపై వెళ్తే అదుపుతప్పి కింద పడటం ఖాయమని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర తేలి అస్తవ్యస్తంగా తయారైన బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేసి రోడ్డు బాగుచేయాలని పలు గ్రామాల ప్రజలు పలుమార్లు వినతి పత్రాలు అందజేడంతో పాటు పలు సమావేశాలకు వచ్చిన ప్రజాప్రతినిధులుకు మొరపెట్టుకున్నారు. అయినా వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు, ప్రజాప్రతినిధులు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రోడ్డు గుంతలమయంగా మారింది



గోపాలపురం నుంచి బూరుగడ్డ వరకు గల రోడ్డుపై గుంతలు పడ్డాయి. దీంతో ఈ రోడ్డును బాగుచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా వారు పట్టించుకోవడం లేదు. గుంతలమయంగా మారిన రోడ్డుపై ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

– గూడెపు అంజయ్య, బూరుగడ్డ

పాలకులు నిర్లక్ష్యం వీడాలి



బూరుగడ్డ– కరక్కాయలగూడెం రహదారిపై వాహదారులకు ప్రమాదాలు సంభవించినా సంఘటనలు చాలానే ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి. రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేయించడంలో పాలకులు నిర్లక్ష్యం వీడాలి.

– షేక్ ఇమామ్, కరక్కాయలగూడెం